

'ఆహ్వానం' అందక... తూతూమంత్రంగా 'జెడ్‌పి'

ప్రజాశక్తి -చిత్తూరుఅర్బన్

అసలే వరుస సెలవులు.. ఆపై సరైన ఆహ్వానం అందలేదు.. దీంతో అంతంతమాత్రపు హాజరుతో, తూతూమంత్రంగానే జెడ్‌పి సమావేశం నడిచింది. ప్రజా సమస్యలపై చర్చే లేకుండా పోయింది. ప్రజాప్రతినిధులుగా ఉన్న జెడ్‌పిటిసిలకు కనీస సమాచారం ఇవ్వడం లేదని వైసిపి ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో పాల్గొనే ప్రజాప్రతినిధులకు ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా ఆహ్వానం పంపాలని జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు సర్దిచెప్పాల్సి వచ్చింది.వచ్చిన వారు సైతం అజెండా, సభ ముగియకముందే సభనుంచి నిష్క్రమించారు. 12 అంశాలను అజెండాగా పెట్టినా ప్రజా సమస్యలపై చర్చే లేకుండా పోయింది. 14 మంది ఎంఎల్‌ఎలకు ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. 16 మంది జడ్‌పిటిసిలు, నలుగురు ఎంపిపిలు పాల్గొన్నారు. 50శాతంపైనే అధికార యంత్రాంగం గైర్హాజర్ కావడం గమనార్హం.

జెడ్‌పి సమావేశ మందిరంలో శనివారం ఉదయం సమావేశం జరిగింది. తమ ప్రాంతాల్లో సంక్షేమ పథకాలకు వెచ్చిస్తున్న

ప్రజా సమస్యలపై చర్చేది..?

నిధుల వివరాలూ తమకు చెప్పడం లేదని అధికారులపై వైసిపి ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అనేక ప్రభుత్వ పథకాల బిల్లులు చెల్లించకపోవడంతో గుత్తేదారులు ఇబ్బందులు పడుతున్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు.


ప్రోటోకాల్ పాటించడం లేదని సత్యవేడు ఎంఎల్‌ఎ ఆదిమూలం, జడ్‌పిటిసి మెంబర్లు చెప్పగా జడ్‌పి ఛైర్మన్ స్పందిస్తూ త్వరలోనే కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ప్రజాప్రతినిధులందరికీ ప్రభుత్వం చేపట్టే వివిధ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలలో ఆహ్వానం పంపేలా చర్యలు చేపడతామన్నారు. యూరియా గురించి జడ్‌పిటిసి సభ్యులు అడగ్గా వ్యవసాయ శాఖ జేడీ మురళీకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ఇంతవరకూ 8,472 మెట్రిక్ టన్నులు అన్ని రకాల ఎరువులను రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు సరఫరా చేశామన్నారు. ప్రస్తుతం 7,156 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు.

మోడల్ స్కూల్స్ పనితీరుపై గుడిపాల ఎంపిపి అడగ్గా డిఇఒ స్పందిస్తూ జిల్లాలో మొత్తం 498 మోడల్ ప్రైమరీ స్కూల్స్ ఉన్నాయని, కుప్పం నియోజకవర్గంలో 35 మోడల్ ప్రైమరీ పాఠశాలలకు మెరుగైన సౌకర్యాల కోసం ప్రత్యేకంగార ఊ.10 కోట్లు కేటాయించి అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో ఉన్న ఎంఆర్‌ఐ, సిటీస్కాన్ వసతులను వినియోగించి అత్యవసర పరిస్థితుల్లో క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చిన్న చిన్న కారణాలతో గర్భవుతను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారన్నారు.

పూతలపట్టు ఎంఎల్‌ఎ మురళీమోహన్ మాట్లాడుతూ దళితవాడల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. మూడు జిల్లాల్లో 2,42,604 మంది షెడ్యూల్ కులాలు, తెగల వినియోగదారులుఉన్నారని, ప్రస్తుతం 200 యూనిట్లు సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. పెద్దమండ్యం మండలంలో వ్యవసాయ పంపుసెట్లకు 300 దరఖాస్తులు వచ్చాయని, రెండు నెలల్లో పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.



జెడ్‌పి సమావేశంలో గోవిందప్ప శ్రీనివాసులు


హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

కేంద్రమంత్రిగా 'దగ్గుమళ్ల'..?

త్వరలోనే క్యాబినెట్ విస్తరణ

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



కేంద్రమంత్రివర్గ విస్తరణ త్వరలోనే జరగనుంది. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం ఒక క్యాబినెట్, ఒక సహాయ క్యాబినెట్‌కు అవకాశం ఇచ్చారు. మూడో మంత్రి పదవిని ఆంధ్రాకు ఇవ్వనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆదివారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి అభ్యర్థి ఎంపికపై జరిగే సమావేశానికి హాజరుకానున్న నారా చంద్రబాబుకు కేంద్ర క్యాబినెట్ విస్తరణ, ఆంధ్రప్రదేశ్‌లో మంత్రి పదవి ఎవరికి ఇవ్వాలనే విషయమై చర్చ జరగనుంది. ఈ నేపథ్యంలో బిజెపి, జనసేన నుంచి కేంద్రమంత్రి పదవి ఆశించినప్పటికీ, టిడిపికే ఇవ్వాలని ఎన్‌డిఎ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు మధ్య పదవీ పోటీ నెలకొంది. ఎస్సీ సామాజికవర్గం కోటాలో మంత్రి పదవి ఇచ్చే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఈ లెక్కన చిత్తూరు ఎంపి దగ్గుమళ్ల ప్రసాద్‌రావుకు కేంద్ర సహాయ మంత్రి ఇచ్చే అవకాశం మెండుగా ఉంది.

బాపట్ల జిల్లాకు చెందిన దగ్గుమళ్ల ప్రసాద్‌రావు ఇన్‌కంట్యాక్స్ ఆఫీసర్‌గా సేవలందించారు. ఆ తరువాత చంద్రబాబునాయుడు ఆహ్వానం మేరకు 2024 ఎన్నికల్లో రాజకీయ అరంగేట్రం చేశారు. ఎవరికీ సాధ్యం కాని విధంగా పార్టీలోకి వచ్చిన రెండు నెలలకే ఎంపిగా భారీ మెజార్టీతో గెలుపొందారు. 2024 ఎన్నికల్లో వైసిపి సమీప అభ్యర్థి రెడ్డెప్పపై 2 లక్షల 23వేల మెజార్టీతో గెలుపొంది పార్లమెంట్‌లో ప్రవేశపెటించారు. ఎంపిగా నియోజకవర్గంలో నెలలో 15-20 రోజులు ఉంటూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టారు. ఏడాది కాలంలో 10 కోట్లకు పైగా ఎంపి నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా సిసి రోడ్లు, కొత్తగా సిక్స్‌లైన్ పడడంతో గ్రామాల మధ్య కనెక్టివిటి కోసం రైల్వే బ్రిడ్జిలు, గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారని కూటమి కార్యకర్తలు చెబుతున్నారు. పార్లమెంట్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గానూ, ఎస్సీ, ఎస్టీ జాతీయ కమిటీలో మెంబర్‌గానూ ఉన్నారు. మరో మూడు జాతీయ కమిటీల్లోనూ దగ్గుమళ్ల చురుగ్గా ఉన్నారు. ఈ ఐదు కమిటీల్లో దగ్గుమళ్ల ప్రసాద్‌రావు చేస్తున్న కృషిని మోడీ ప్రధాని గతంలో వ్యక్తిగతంగా అభినందించారు. కేంద్ర క్యాబినెట్ విస్తరణ నేపథ్యంలో ఆంధ్రాలో మంత్రి పదవి ఎవరిని ఇవ్వాలనే చర్చ నడిచిన నేపథ్యంలో అధినేత సైతం 'దగ్గుమళ్ల' వైపే మొగ్గు చూపినట్లు విశ్వసనీయ సమాచారం.

వెదురారణ్యం పార్కు ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు - వేలూరు రోడ్డు, కలెక్టరేట్ సర్కిల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన 'వెదురారణ్యం పార్కు'ను చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, చుడా ఛైర్పర్సన్ కఠారి హేమలత ప్రారంభించారు. అనంతరం నూతనంగా తీర్చిదిద్దిన వెదురారణ్యం పార్కు పరిసరాలను పరిశీలించారు. ఎంపి, ఎంఎల్‌ఎ మొక్కలు నాటారు.


వెరురాణ్యంను ప్రారంభిస్తున్న ఎంపి

ఉత్తమ సేవలకు అవార్డులు


ప్రశంసాపత్రం అందుకుంటున్న సీఐ శ్రీనివాసంతి


హౌసింగ్ ఏఈ శ్రీధర్


ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న శేషాద్రి రెడ్డి

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు

విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను గంగాధర నెల్లూరు సీఐ శ్రీనివాసంతి స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని చిత్తూరు పోలీసు గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతులు మీదుగా ఉత్తమ సేవా ప్రశంసాపత్రాన్ని జ్ఞాపికను అందుకున్నారు. అలాగే మండలం గృహ నిర్మాణ శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన గంగాధర నెల్లూరు హౌసింగ్ ఏఈ శ్రీధర్, మండలం విద్యుత్ శాఖలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఏడీ శేషాద్రి రెడ్డికి మంత్రి సత్యకుమార్ యాదవ్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ చేతుల మీదుగా స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలు సందర్భంగా ఉత్తమ ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

మునికృష్ణయ్యకు అవార్డు

ప్రజాశక్తి - ఎస్ ఆర్ పురం



మండలంలోని మంగుంట గ్రామానికి చెందిన ఎస్.కె మునికృష్ణయ్య సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి 79వ స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డు ఇచ్చారు. గత 20 ఏళ్లుగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను నిరుపేదలకు స్వచ్ఛంద సంస్థల ద్వారా సోషల్ సర్వీస్ చేస్తున్న మునికృష్ణయ్య సేవలను గురించి ఆయను మంత్రి సత్యకుమార్, కలెక్టర్ సుమిత్ కుమార్, ఎసీప మణికంత చందోలు ప్రశంసాపత్రాన్ని, అవార్డును అందించారు.

ఆదర్శ రైతుగా సిహెచ్ మోహన్‌రావు



ప్రజాశక్తి- వి కోట: వి కోటకు చెందిన సిహెచ్ మోహన్ రావు వినూత్నంగా చేపట్టిన డ్రాగన్ పంట సాగు ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తోంది. ఉద్యాన శాఖ వారి ప్రోత్సాహంతో మరింత మంది రైతులు లబ్ధి పొందే విధంగా చర్యలు చేపట్టారు. వీరి ప్రతిభను గుర్తించి 79వ స్వతంత్ర దినోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వేడుకల్లో రైతు మోహన్ రావుకు హార్టికల్చర్ విభాగంలో జిల్లాలో ఉత్తమ ఆదర్శ రైతుగా ఎంపిక చేసి రాష్ట్ర మంత్రి సత్య కుమార్ యాదవ్ చేతులమీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమం, అన్నదాతల సంతోషమే లక్ష్యంగా ముందుకెల్తోందని తెలిపారు.

తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామికి టీటీడీ సారె

ప్రజాశక్తి - తిరుమల: ఆడికతిక పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుత్తణి శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి టీటీడీ ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు శనివారం శ్రీవారి సారె సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ మర్యాదలతో తిరుత్తణి ఆలయ ఛైర్మన్ శ్రీధర్, తమిళనాడు దేవాదాయశాఖ జాయింట్ కమిషనర్ రమణి టీటీడీ ఛైర్మన్‌కు స్వాగతం పలికారు. టీటీడీ ఛైర్మన్ మాట్లాడుతూ టీటీడీ తరపున శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి శ్రీవారి పట్టువస్త్రాలను సమర్పించడం సంతోషంగా ఉందన్నారు.



న్యూ గంగాకాలనీలో మౌలిక వసతులకు కృషి

కాలనీలో పర్యటించిన కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే,

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

చిత్తూరు పట్టణ పరిధిలోగల కొండ ప్రాంతంలో 20ఏళ్ల క్రితం ఇచ్చిన ఇంటి స్థలాల్లో అరాకొరా వసతుల మధ్య జీవిస్తున్న తేనబండ, న్యూ గంగాకాలనీ వాసుల కష్టాలు తొలగించేందుకు చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చర్యలకు ఉపక్రమించారు. ఇప్పటికే కాలనీవాసుల విన్నపంతో ఎమ్మెల్యే ఇటీవల త్రీఫేస్ విద్యుత్ కనెక్షన్ సౌకర్యం కల్పించారు. తాజాగా కాలనీవాసుల కష్టాలను ప్రత్యక్షంగా పరిశీలించి, మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే, చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ సుమిత్ కుమార్, మేయర్ ఎస్.అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, కమిషనర్ పి.నరసింహ ప్రసాద్‌తో కలసి శనివారం న్యూ గంగా కాలనీలో పర్యటించారు. ఈసందర్భంగా కాలనీలో మహిళలు మాట్లాడుతూ.. 20 ఏళ్ల క్రితం ఇంటి పట్టాలు ఇచ్చారని.. సౌకర్యాలు లేకపోయినా.. ఇక్కడే నివాసం ఉంటున్నామని, కాలనీలో ప్రధానంగా కనీస రోడ్డు సౌకర్యం లేదని, వీధి దీపాలు లేదన్నారు. కొండ ప్రాంతాలు కావడంతో


న్యూ గంగా కాలనీ ప్రజల సమస్యలు తెసుకుంటున్న కలెక్టర్, ఎంపి, ఎంఎల్‌ఏ

విషపు పురుగులతో భయంగా భయంగా బతుకుతున్నామని చెప్పారు. తాగునీటికి సరైన సౌకర్యాలు లేవని, ఇంటి స్థలం ఉన్నా సౌకర్యాలు లేని కారణంగా చాలామంది గృహాలు నిర్మించుకోలేదన్నారు. కాలనీవాసుల సమస్యలపై ఎమ్మెల్యే.. ఎంపీ, కలెక్టర్‌తో చర్చించారు. కాలనీలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే వందలాది మందికి ఇక్కడ ఇల్లు నిర్మించుకునే అవకాశం ఉంటుందన్నారు. మరిన్ని ఇంటి స్థలాలు అందుబాటులోకి వస్తాయని పేదలకు పంపిణీ చేయొచ్చు అని చెప్పారు. ఎంపీ నిధులు, కలెక్టర్ నిధులు, చూడా నిధులు, మున్సిపల్ నిధులతో రోడ్లు, నీటి సౌకర్యం కల్పించేందుకు వేగంగా చర్యలు తీసుకుంటామన్నారు. కాలనీ మొత్తం అభివృద్ధి చేయడానికి అవసరమైన యాక్షన్ ప్లాన్, రోడ్ల నిర్మాణానికి మ్యాప్ రూపొందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, డీఈ రమణ, హౌసింగ్ ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకం : కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు, రైతు ఉద్యమ కారకుడు, అణగారిన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ప్రత్యేక సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ గౌతు లచ్చన్న 116వ జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమం, జమీందారీ వ్యతిరేక పోరాటం, హరిజన సేవ, మద్యపాన నిషేధం వంటి రంగాల్లో లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికై ఆయన జీవితాంతం శ్రమించారని గుర్తుచేశారు. ఆయన చూపిన ఆత్మీయత, త్యాగం, పోరాటస్ఫూర్తిని యువత తమ జీవితాలలో ఆచరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బలహీన వర్గాల ప్రజలు



అభివృద్ధి వరుసలో ముందు ఉండాలని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బలహీనవర్గాలకి అనేక సంక్షేమ పథకాలు అమలుచేయుచున్నదని వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి పథంలో ముందు ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపి దగ్గుమళ్ళ ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, చూడ ఛైర్‌పర్సన్ హేమలత, నగర మేయర్ ఆముద, మొదలియార్ అధ్యక్షులు త్యాగరాజన్, సిఆర్.రాజన్, బీసీ సంక్షేమ అధికారులు రుబ్బాని నివాళులర్పించారు.

సూపర్ సిక్స్.. ప్రజలపై భారాలు ఫిక్స్..

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఎన్నికల ముందు ఓట్ల కోసం నాడు ప్రకటించిన సూపర్ సిక్స్.. ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఇందులో తల్లికి వందనం, ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పెంపు, దీపం 2 తాజాగా ఆగస్టు 15 స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం. జిల్లాలో దీపం పథకం 3,34,795 మంది ఎల్‌పిజి వినియోగదారుల ఖాతాలకు రూ.28.56 కోట్లు, ఎన్.టి.ఆర్ భరోసా పెన్షన్ 2,69,805 మందికి రూ.556 కోట్లు, తల్లికి వందనం 2,23,201 మంది విద్యార్థులకు సంబంధించి రూ.335 కోట్లు, అన్నదాత సుఖీభవ కింద 2,05,753 రైతు కుటుంబాలకు రూ.103 కోట్లు, పిఎం కిసాన్ కింద 1,76,441 మంది రైతు కుటుంబాలకు రూ.35 కోట్ల, స్త్రీ శక్తి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం 88 లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణం ఇలా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల భారం తిరిగీ ప్రజలపై పన్నుల రూపంలో పడటం ఫిక్స్ అని అనుమానం ప్రజలు వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల పేరుతో ప్రజలు అధిక విద్యుత్ బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ఇక స్త్రీశక్తి పథకం విషయానికి వస్తే పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ మెట్రో, మెట్రో ఎక్స్ప్రెస్, ఎక్స్ప్రెస్ బస్సులలో ఈ పథకాన్ని వర్తింజేస్తోంది. జిల్లాలో 207 పల్లెవెలుగు, 63 ఎక్స్ప్రెస్ సర్వీసుల్లో మహిళలు ఉచిత ప్రయాణం చేయవచ్చు. స్త్రీ శక్తి పథకం కూలీ పనులకు, ఉద్యోగాలకు, కళాశాల, పాఠశాలలకు వెళ్లే మహిళలు, ఆడపిల్లలకు చాలా ఉపయోగంగా ఉంటుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 88లక్షల మంది మహిళలు ఈ సౌకర్యంను వినియోగించుకోనున్నారు. సగటున ఒక్కో కుటుంబానికి నెలకు రూ.4వేల వరకు డబ్బులు మిగులుతుందని అంచనా వేస్తున్నారు. బసు స్టేషన్స్‌లో ప్రయాణీకుల రద్దీకు అనుగుణంగా కుర్చీలు, ఫ్యాన్లు, టాయిలెట్‌లు ఏర్పాటుతో పాటు మహిళల కోసం అదనంగా పింక్ టాయిలెట్‌లు ఏర్పాటు చేస్తున్నారు. డ్రైవర్ల కొరతను అధిగమించడానికి అదనంగా 200 డ్రైవర్లను ఆన్‌కాల్ ద్వారా నియమించి శిక్షణ అందిస్తున్నారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలపై తిరిగీ భారాలు మోపకుండా చూడాలని జిల్లా ప్రజానికం కోరుతున్నారు. ఓ వైపు ఉచితాలిస్తూ.. మరో వైపు భారాలు మోపవద్దని కోరుతున్నారు.


మహిళా ఉచిత బస్సును ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్ (ఫైల్)

తాగునీటి సమస్యలను వెంటనే పరిష్కరిస్తాం..


సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు : జెడ్‌పి ఛైర్మన్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసులు, జెసి విద్యాధరి

ప్రజాశక్తి- చిత్తూరు (యాదమరి): తాగునీటి సమస్యలను పరిష్కరించడానికి తగిన చర్యలు చేపట్టామని జెడ్‌పి ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం చిత్తూరులోని జెడ్‌పి సమావేశ మందిరంలో సమావేశం అనంతరం జెడ్‌పి ఛైర్మన్, జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి పాత్రికేయులతో మాట్లాడారు. సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలకు త్వరలో పరిష్కారం చూపడం జరుగుతుందన్నారు. సభ దృష్టికి వచ్చిన తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ఆర్ డబ్ల్యు ఎస్ అధికారులను ఆదేశించామన్నారు. అవసరమైన చోట ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీరింగ్ పనులకు సంబంధించి పెండింగ్ బిల్లులను త్వరలో మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రానున్న వర్షాకాలంను దృష్టిలో ఉంచుకుని ఆర్‌డబ్ల్యుఎస్, డిపిఓ, వైద్య ఆరోగ్యశాఖల ద్వారా పారిశుధ్యం, మెరుగైన వైద్యసేవలకు చర్యలు చేపట్టాలని ఆదేశించామన్నారు. జెసి మాట్లాడుతూ పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖలో ఇంజనీరింగ్ వర్క్స్‌కు సంబంధించి పెండింగ్ బిల్లుల మంజూరుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం అందని రైతులు తమ భూ వివరాలను, బ్యాంక్ వివరాలు, ఆధార్ ఈకేవైసి సమస్యలను గుర్తించి సరిచూసుకోవాలన్నారు. కొంతమంది రైతులు అందుబాటులో లేని కారణంగా సమస్యలను పరిష్కరించ లేకపోయామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కొరకు గత 4 నెలల నుండి రెవెన్యూ, వ్యవసాయ శాఖల ద్వారా దాదాపు 1,39,000 మంది రైతుల సమస్యలను పరిష్కరించామన్నారు. ఇంకా సమస్య ఉన్న రైతులు తహశీల్దార్ కార్యాలయం, ఆర్‌ఎస్‌కే లకు వెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. తల్లికి వందనం అందని లబ్ధిదారులు తహశీల్దార్, డీఈఓ, కలెక్టర్ కార్యాలయాలను సంప్రదించాలన్నారు. జిల్లాకు కేటాయించిన నిధులకంటే మంజూరు చేసిన పనులు అధికంగా ఉన్న కారణంగా కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయని, జిల్లా కలెక్టర్ ఎంపిడిఓ లు, ఇతర సంబంధిత అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు.

దోమలు బాబోయ్ దోమలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన సోమలలో దోమల బెడద ఎక్కువ కావడంతో ప్రజలు దోమకాటుకు గురై అనారోగ్యం పాలవుతున్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా అక్కడక్కడ రోడ్లపై ఖాళీ ప్రదేశాలలో వర్షపు నీరు నిలువ ఉండి అందులో దోమలు వృద్ధి చెంది సాయంత్రం వేళల్లో దోమలు ప్రజలపై దాడులు చేసి కుట్టి అనారోగ్యం పాలు చేస్తున్నాయి. పంచాయతీ వారు స్పందించి ఫాగింగ్ యంత్రాల ద్వారా గ్రామంలో మిలాథిన్ ద్రావణాన్ని యంత్రాలలో వేసి తద్వారా వచ్చే పొగను గ్రామంలో వీధులలో వదలాలని ప్రజలు కోరుతున్నారు. అప్పుడైనా దోమలు కుట్టకుండా పుట్టకుండా ఉండే అవకాశం ఉందని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పంచాయతీ వారు స్పందించి గ్రామంలో దోమల బెడద లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు కోరుతున్నారు.



21న జాబ్ మేళా

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఈనెల 21న గూడూరు పట్టణంలోని డిఆర్‌డబ్ల్యూ కలశాలలో మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా జాబ్ మేళా పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ముందంజలో ఉండాలని ముఖ్యమంత్రి నిరంతరం పనిచేస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఎంతో మందికి స్కిల్స్ నేర్పించి ఉపాధి కల్పిస్తున్నారన్నారు. అధికారంలోకి రాగానే లోకేష్ యువతకు 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తానని మాటిచ్చారన్నారు. అందులో భాగంగానే ప్రతి నెల ఏపీ ఎస్ఎస్‌డిసి ద్వారా జాబ్ మేళా నిర్వహించి యువతకు అవకాశం కల్పిస్తున్నారన్నారు.

హరోం హర నినాదంతో హోరెత్తిన కుమారగిరి


కావళ్లతో వచ్చిన మొక్కులున్న భక్తులు

ప్రజాశక్తి- కార్వేటినగరం, వెదురుకుప్పం: మండల కేంద్రంలోని స్కంధపుష్కరిణీ సమీపంలోని కుమార గిరిపై వెలసి ఉన్న వల్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామి వార్షిక ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం భక్తిశ్రద్ధలతో కావళ్లతో వచ్చిన భక్తులు చేసిన హరోం హర నామస్మరణాలతో వీధులు హోరెత్తాయి. చుట్టుపక్కల గ్రామాల నుంచి వేల మంది భక్తులు పసుపు వస్త్రాలు ధరించి, సుగంద భరిత పుష్పమాలికలతో కావళ్లతో స్వామివారిని దర్శించుకున్నారు. ముత్తు మునస్వామిరెడ్డి, దేవారెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 5వేల మందికి పైగా భక్తులకు అన్నదానం చేశారు. మునిప్రసాద్ 30 వేల లడ్లను భక్తులకు వితరణ చేశారు. కార్వేటినగరం యువత భక్తులకు మజ్జిగ, తాగునీరు అందుబాటులో ఉంచి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో క్రిష్ణనాయక్, సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

స్కంధపుష్కరిణి సమీపంలోని కుమారగిరిపై వెలసి ఉన్న వల్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి వార్షిక బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం పద్మసరస్సు ఎస్టీ కాలనీ వాసులు 'అమ్మవారికి ప్రత్యేక వాయిద్యాల నడుమ, బాణసంచాలు పేల్చుకుంటూ సారెను గ్రామవీధుల్లో ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించిన తెప్పపై ఆశీనులై విహరిస్తూ భక్తులకు స్వామివారు దర్శన భాగ్యం కల్పించారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నగరి డీఎస్పీ సయ్యద్ అహ్మద్ అజీజ్, సీఐ హనుమంతప్ప, ముగ్గురు ఎస్.ఐలు పలువురు సిబ్బంది పర్యవేక్షించారు.

గంగాధర నెల్లూరు: కోటగారం పంచాయతీలోని ఎట్టేరి గ్రామంలో కొండపై వెలసిన శ్రీ శివశణ్ముఖ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం, సిద్దేశ్వర కొండలోని సుబ్రహ్మణ్యస్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులందరకు తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సామూహిక పుష్పకావిళ్ళ ఊరేగింపు

సోమల: ఆడికృత్తిక సందర్భంగా మండల కేంద్రమైన సోమల సమీపంలోని నరివేపానికొండపై వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారికి పుష్పకావిళ్లను చెల్లించేందుకు సోమలలోని మూడు దేవాలయాలలో భక్తులు పుష్పకావిళ్లను అలంకరించి పూజలు నిర్వహించి అనంతరం కావిళ్లను మోసుకుంటూ పురవీధులలో ఊరేగించారు. అనంతరం బంగారు తిరుత్తని వద్దకు పాదయాత్రగా వెళ్లి పుష్ప కావిళ్లను చెల్లించుకున్నారు.

కనువిందు చేసిన స్వామి వారి కళ్యాణం

మండల కేంద్రమైన సదుం సమీపంలోని శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్య స్వామివారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించగా భక్తులకు కనువిందు చేసింది. ఆడికృత్తిక మహోత్సవాలలో భాగంగా శనివారం ఉదయం ఆలయంలోని మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు చేసి కర్పూర హారతులు అందజేసి భక్తులకు తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి –కార్వేటినగరం: కార్వేటినగరంలో టీటీడీ అనుబంధంలో ఉన్న ప్రముఖ వేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమని ఘనంగా నిర్వహించారు. శనివారం వేకువ జామున స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, కొలువు, అర్చన వంటి నిత్యకైంకర్యాలను చేపట్టారు. అలాగే స్వామివారి మూలవిరాట్ను పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ మూర్తులకు వేదపండితులు వేద మంత్రాల నడుమ స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం తిరుచివాహనంపై ఆశీనులై ఆలయ మాడవీధుల్లో విహరించారు.

భగవద్గీత పుస్తకాలు పంపిణీ..

కార్వేటినగరంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణ జయంతి సందర్భంగా తిరుపతికి చెందిన సుంకల గిరిజమ్మ, సుబ్రహ్మణ్యం, కంచి త్యాగరాజు కంచి మోహన్ ఆధ్వర్యంలో భగవద్గీత పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం కృష్ణాష్టమికి భగవద్గీత పుస్తకాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి వీఆర్వో ప్రసాద్, శ్రీధర్ టీటీడీ ఏఈఓ రవికుమార్ ఆది అధికారి సురేష్ కుమార్ అర్చకులు రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఆర్ పురం: శ్రీకృష్ణాష్టమి వేడుకలను మండలంలోని అన్ని గ్రామాలలో ప్రజలు శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలోని శ్రీకృష్ణ భజన మందిరాల్లో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దుర్గరాజపురం నారాయణ క్షేత్రంలో ఇస్కాన్ ప్రభుపాదులు మహా హారతి, పూజలు నిర్వరహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

సోమల: మండలంలోని కందూరు గ్రామంలోని శ్రీ భారతి విద్యామందిర్ విద్యార్థులు శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా కృష్ణుడు, గోపిక వేషధారణ వేసి సందడి చేశారు. ఈసందర్భంగా కరస్పాండెంట్ షేక్ మహమ్మద్ అంజాద్ మాట్లాడుతూ పాఠశాలలోని అందరు విద్యార్థులు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలలో భాగంగా వేషధారణ వేసి ఉట్టి కొట్టే కార్యక్రమంలో పాల్గొన్నారని తల్లిదండ్రులు పాఠశాల సిబ్బంది వేడుకలను విజయవంతం చేశారని తెలిపారు.

పలమనేరు: పలమనేరులో ఆడికృత్తిక, కృష్ణాష్టమి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. పలమనేరు మున్సిపల్ పరిధిలోని టీఎస్ అగ్రహారంలో వెలసి ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఆలయ మర్యాదలతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. కుట్టీ, గిరిబాబు, సుబ్రహ్మణ్యం గౌడ్, శ్రీధర్, ఖాజా, నాగరాజు, మదన్, రూపేష్, జగదీష్, హరీష్, సుధాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: మండలంలోని రామనపల్లి గ్రామంలో కృష్ణాష్టమి సందర్భంగా ఆలయంలో పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు ఆలయానికి చేరుకొని స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. స్థానిక సర్పంచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.


సోమలలో..

క్రైం న్యూస్



రక్తపు మడుగులో హత్యకు గురైన ప్రియాంక, మృతురాలి (ఫైల్ ఫొటో)

భార్యను చంపిన భర్త

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: భార్య ప్రవర్తన నచ్చకపోవడంతో భర్త ఆమెను చంపిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. సిఐ కె.శ్రీనివాసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొదలమడుగు గ్రామానికి చెందిన జగన్నాథం కుమారుడు హరిబాబు అదే గ్రామంలో శ్రీనివాసు కుమార్తె ప్రియాంక (20)ను మూడేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి ఏడాది వయస్సు కలిగిన ఒక కొడుకు ఉన్నారు. గత కొంతకాలంగా ప్రియాంక ప్రవర్తన నచ్చక పలుమార్లు నచ్చచెప్పిన ఆమె ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ప్రియాంక అమ్మగారి ఇంట్లో ఉండగా తన వెంట తెచ్చుకున్న కత్తితో గొంతుకోసి హత్య చేశారు. అనంతరం అతను డిఎస్పీ ఆఫీసులో సరెండర్ అయ్యారు. ప్రియాంక అక్కడికక్కడే రక్తపు మడుగులో పడి విలవిలలాడి ప్రాణాలను విడిచింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రియాంక తల్లి రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోళ్ల ఫారంలో వలస కార్మికుడు మృతి


మృతి చెందిన నందకుమార్ యాదవ్

ప్రజాశక్తి- చౌడేపల్లి: కోళ్ల ఫారంలో వలస కార్మికుడు ఆకస్మికంగా మృతి చెందిన సంఘటన శనివారం చౌడేపల్లి మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని కాకతి పంచాయతీ సమీపంలో ఓ ప్రైవేటు కోళ్ల ఫారం ఉంది. ఆ కోళ్ల ఫారంలో గత మూడు సంవత్సరాలుగా చత్తీస్గడ్‌కు చెందిన నందకుమార్ యాదవ్ (35) అనే వలస కార్మికుడు పనిచేస్తున్నాడు. శనివారం మూర్చవ్యాధి రావటం రావడంతో కోళ్ల ఫారంలో పనిచేస్తున్న కూలీలు అతన్ని మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.

గొర్రెల మంద పై చిరుత దాడి

ఏడు గొర్రెలను ఎత్తుకెళ్లిన చిరుత పులి


చిరుత దాడిలో గాయపడిన గొర్రె

ప్రజాశక్తి- చౌడేపల్లి: గొర్రెల మందపై చిరుత దాడి చేసి ఏడు గొర్రెలను ఎత్తుకెళ్లిన సంఘటన శనివారం చౌడేపల్లి మండలంలో చోటుచేసుకుంది. పంచాయతీ కేంద్రమైన ఆమనిగుంటకు చెందిన సుధాకర్, సయ్యద్ బాషలు సమీపంలోని అంకాలమ్మ కొండకు మేత కోసం తమ గొర్రెల మందను తరలించారు. కొండపైకి ఎక్కుతూ గొర్రెలు మేస్తుండగా ఒక్కసారిగా చిరుత పులి వాటిపై దాడి చేసింది. ఈ దాడిలో ఓ గొర్రెలను కాపరి కాపాడడంతో ఏడు గొర్రెలు కనిపించకుండా పోయాయి. గత రెండు నెలలుగా చిరుతపులి సంచారం ఉన్నప్పటికీ అటవీ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని రైతులు వాపోతున్నారు. గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నామని ఇలాంటి పరిస్థితుల్లో చిరుత తమ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తోందని, ఇకనైనా సంబంధిత అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని చిరుత నుంచి తమ పశు పాడి గొర్రెల సంపదను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

అదుపు తప్పి బోల్తాపడిన ఐచర్

డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం : అదుపుతప్పి ఐచర్ బోల్తా పండటంతో డ్రైవర్ స్వల్ప గాయాలైన సంఘటన శనివారం మండలంలోని మొగిలి ఘాట్లో చోటుచేసుకున్నది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు బెంగుళూరు నుండి తిరుపతికి వెళుతున్న ఐచర్ వాహనం అతి వేగంగా రావడంతో అదుపుతప్పి జాతీయ రహదారికి అడ్డంగా బోల్తా పడ్డది. ఈ సంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాల కాగా అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

వికలాంగులపై వివక్ష ఎందుకు..?

రాష్ట్ర వికలాంగుల జేఏసీ అధ్యక్షులు చంద్రశేఖర్


ధర్నా చేస్తున్న వికలాంగులు , నాయకులు

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: వికలాంగులపై పక్షవాతం ఎందుకని.. రాష్ట్ర వికలాంగుల జేఏసీ అధ్యక్షులు చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట వికలాంగులతో జాతీయ రహదారిపై ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 7వేల మంది వికలాంగులను సర్వే చేపట్టి వారికి వికలాంగత్వం తక్కువ ఉన్నదని తక్కువ పర్సెంటేజీలు నమోదు చేసి తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. రాబోయే సెప్టెంబర్ నెలలో వీరికి వికలాంగుల పెన్షన్ పంపిణీ చేయబడుదని ముందస్తు నోటీసులు సర్వే చేశారని, అందులో పంచాయతీ కార్యదర్శి సంతకం కానీ ఎంపీడీవో సంతకం కానీ జిల్లా కలెక్టర్ సంతకం గాని ఏది లేకుండానే పంచాయతీ అధికారులు నోటీసులు పంపిణీ చేయడం ఎంతవరకు సమంజసమని అన్నారు. దీనిపై సోమవారం జిల్లాల్లోని వికలాంగులందరితో కలిసి కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. వీరికి తిరిగి వికలాంగుల పెన్షన్ యధావిధిగా కొనసాగే అంతవరకు వికలాంగుల జేఏసీ పోరాట పట్టిమ చేపడుతామన్నారు. రాష్ట్ర వికలాంగుల జేఏసీ ఉపాధ్యక్షులు మురళి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుమతి, కార్యదర్శి లీలాపతి నాయుడు, వికలాంగులు ఏకాంబరం, సమీర్ బాష, ఆర్షద్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి- సోమల: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా ఈనెల 15వ తేదీ ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభించడంతో శనివారం సోమల మండలం 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీ కమ్మపల్లెలో మహిళలు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి సంబరాలు చేసుకున్నారు. నంజంపేట- పుంగనూరు ఆర్టీసీ బస్సు సర్వీసుకు ప్రత్యేక అలంకరణలు చేసి గ్రామంలోని మహిళలు బస్సులో ఉచితంగా ప్రయాణించారు.

వాసు దేవయ్య బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ఎఫ్ఏసి) ప్రధానోపాధ్యాయులుగా వాసు దేవయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. గత నెల 31వ తేదీ అప్పటి ప్రధానోపాధ్యాయులు ఉద్యోగవిరమణ చెందడంతో సీనియర్ ఉపాధ్యాయులు అయిన వాసుదేవయ్య డీఈవో ఆదేశాల మేరకు ప్రధాన ఉపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టారు. పాఠశాల అభివృద్ధికి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలకు విద్యార్థులలో క్రమశిక్షణకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. పాఠశాల సిబ్బంది శాలువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో షకీల్, మురళి, దేవిక, రామానుజులు, హసీనా, హైదర్ వల్లి, వాత్సల్య, కవిత, రవీంద్ర పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


నూతన ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అలిపిరిలో అగచాట్లు

శ్రీవారి టోకెన్లకు 14 గంటలు నిరీక్షణ

అన్నప్రసాదం సరఫరా చేయని టిటిడి



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: శ్రీవారిని దర్శనం చేసుకోవాలంటే సామాన్య భక్తులు నలిగిపోవాల్సిందే.. ఎంతో భక్తిశ్రద్ధలతో దేవునికి ముడుపులు చెల్లించాలని వొక్కపొద్దులు ఉండి, కాలినడకన వచ్చే భక్తులు కొందరైతే, రైళ్లల్లో, బస్సుల్లో వచ్చి శ్రీవారి చెంత వారు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. క్షణకాలమే శ్రీవారిని చూసే భాగ్యం కోసం కుటుంబ సమేతంగా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. భక్తిశ్రద్ధలతో వస్తున్న వారికి దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లు అరకొరనే చెప్పాలి. 'ఏఐ' టెక్నాలజీతో భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పిస్తామని పదేపదే చెబుతున్నప్పటికీ మాటలే తప్ప చేతల్లో లేదనే చెప్పాలి. ఇప్పటికీ భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిల్చుని ఇబ్బందులు పడక తప్పడం లేదు. క్యూలైన్లలో ఉండేవారికి కేవలం తాగునీరు తప్ప, పాలు, అన్నప్రసాదాలు ఇవ్వడం లేదు.

ఆన్‌లైన్‌లో టోకెన్ పొందిన వారు కాకుండా, ఆఫ్‌లైన్‌లో ఉండే భక్తుల కోసం టికెట్లు పొందేందుకు తిరుమల కాకుండా తిరుపతిలో అలిపిరి, విష్ణువాసం, శ్రీనివాసంలలో రోజుకు 12వేల టికెట్లను విడుదల చేస్తారు. ఎక్కువగా స్థానికులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటారు. అయితే తమిళనాడు, కర్నాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లోన ఇతర ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో టికెట్ లభించనివారు సైతం ఆఫ్‌లైన్‌లోనూ రావడంతో ఎలాగైనా శ్రీవారిని దర్శించుకోవాలని ఇతర రాష్ట్రాల భక్తులు సైతం ఈ టికెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అలిపిరి బాలాజీ బస్టాండ్ దగ్గర టిటిడి ఐదు షెడ్లలో 15వేల మంది భక్తులు నిరీక్షించేలా ఏర్పాటు చేశారు. వారాంతపు సెలవులు మూడు రోజులు సెలవు దినాలు కావడంతో శుక్రవారం నుంచి రద్దీ ఎక్కువయ్యింది. శనివారం ఐదు గేట్లు నిండిపోయి దాదాపు మూడువేల మంది భక్తులు ఎండలోనే క్యూలైన్‌లో నిల్చున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు క్యూలైన్‌లోకి వెళ్లిన భక్తులు సాయంత్రం నాలుగు గంటలకు బయటకు వచ్చారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఊహించుకోవచ్చు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మథుర ప్రాంతానికి చెందిన రాహుల్ ఏడుగురు కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనానికి వచ్చారు. శనివారం తెల్లవారుజామున ఒంటిగంటకు రైలు దిగి టికెట్ల కోసం అలిపిరికి చేరుకున్నాడు. షెడ్ల గేట్లు మూడు గంటలకు తెరవడంతో క్యూలైన్‌లోకి వెళ్లారు. రాహుల్ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ నీళ్లు తప్ప టిటిడి ఏమీ ఇవ్వలేదని, ఉదయం నుంచి ఆకలితో అల్లాడామని, బయటకు వెళ్లి ఏమైనా తినాలంటే ఎక్కడ వెనకబడిపోతామోనని క్యూలైన్‌లోనే ఉండిపోవాల్సి వచ్చింది. తిరుమలలో ఏ విధంగా అయితే అన్నప్రసాదాలు ఇస్తున్నారో ఆ విధంగా టికెట్ల క్యూలైన్‌లోనూ పంపిణీ చేయాలని కోరుతున్నారు.

స్విగ్గీ, జొమాటోకు భలే డిమాండ్

అలిపిరి టోకెన్ల జారీ కేంద్రంలో శ్రీవారి దర్శనం టికెట్లు పొందాలంటే 10-15 గంటల సమయం పడుతున్న నేపథ్యంలో భక్తులు అకలికి తట్టుకోలేక స్విగ్గి, జొమాటోలకు ఆర్డర్ పెట్టించుకుని తిని కడుపు నింపుకుంటున్నారు. ఆంధ్ర, తెలంగాణా, స్థానిక భక్తులు మాత్రం ముందే తెలుసుకుని ఆర్డర్ పెట్టుకుంటున్నారు. హిందీ, తమిళం, కన్నడం రాష్ట్రాల వారు పస్తులుంటున్నారు. బాగా చదువుకున్న యువత ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుని తెప్పించుకుంటున్నారు.

శ్రీ స్వామి హథీరాంజీ మఠం భవనం కూల్చివేతకై...

ముగిసిన టెండర్ ప్రక్రియ

- రాష్ట్రవ్యాప్తంగా పాల్గొన్నది 32 మంది
- దక్కించుకున్న పుత్తూరు పయనీర్ స్టీల్స్



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల శ్రీవారికి ప్రియమైన భక్తుడిగా గుర్తింపు పొందిన శ్రీ స్వామి హథీరాం బావాజీకి చెందిన తిరుపతి గాంధీ రోడ్డులోని మఠం భవనం శిథిలావస్థకు చేరడంతో ఎండోమెంట్ కమిషనర్, నగరపాలక సంస్థ కమిషనర్ నోటీసులతో మఠం పరిపాలనాధికారి బాపిరెడ్డి కూల్చివేత ప్రక్రియకు సంబంధించి శనివారం టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. ఈ టెండర్ల ప్రక్రియకు సంబంధించి కాకినాడ, రాజమండ్రి, విజయవాడ, పుత్తూరు, తిరుపతి వివిధ ప్రాంతాలకు సంబంధించి ఆన్ లైన్ లో బిడ్ దాఖలు చేసిన ఐదు మందితోపాటుగా 27 మంది ఆఫ్ లైన్ మొత్తం కలిపి 32 మంది ఈ టెండర్ ప్రక్రియలో పాల్గొన్నారు. మఠం భవనం కూల్చివేసే సమయంలో అక్కడి మెటీరియల్ కు సంబంధించి నిర్వహించిన టెండర్ ప్రక్రియలో మొదటగా ఆన్ లైన్ లో రూ.37 లక్షల రూపాయలకు బిడ్ దాఖలు కావడంతో, మఠం అధికారులు రూ.37 లక్షల నుండి వేలంపాటను ప్రారంభించగా పుత్తూరుకు సంబంధించిన పయనీర్ స్టీల్స్ వారు రూ.97 లక్షల 20 వేల రూపాయలకు హెచ్చు పాటను నమోదు చేశారు. అలానే భవనం కూల్చివేతకు సంబంధించి నిర్వహించిన వేలం పాటలో రూ.1 లక్షా 50 వేల రూపాయలను హెచ్చుపాటగా నమోదు చేయడంతో వీరికి రెండు టెండర్లను ఇస్తున్నట్లుగా మఠం అధికారులు ప్రకటించారు.

సమన్వయ సమావేశం నిర్వహిస్తాం : బాపిరెడ్డి, పరిపాలనా అధికారి, మఠం



వేలంపాట ముగిసిన అనంతరం మఠం పరిపాలనాధికారి బాపిరెడ్డి మాట్లాడుతూ శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం కూల్చివేతకు సంబంధించి ప్రస్తుతం నిర్వహించిన టెండర్ల ప్రక్రియ వివరాలను, మఠన్ ద్వారా లీజు ప్రతిపాదికన దుకాణాలు పొందిన వారి పరిస్థితిని తెలియజేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ వారికి రిపోర్టు చేస్తున్నామన్నారు. అదేవిధంగా ఇక్కడి వాస్తవ పరిస్థితులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యతో కలిసి సమన్వయ సమావేశాన్ని నిర్వహించి అటు తర్వాత సయోధ్య నిర్ణయాన్ని తీసుకుని టెండర్ దక్కించుకున్న వారికి మఠం భవనం కూల్చివేతకు సంబంధించి ఆర్డర్ కాపీలను ఇస్తాము.

దుకాణదారులకు న్యాయం చేయాల్సిందే : మబ్బు దేవనారాయణరెడ్డి

శ్రీ స్వామి హథీరాంజీ మఠం ద్వారా లీజు ప్రతిపాదికన దుకాణాలను పొందిన వారికి ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చూపకుండా అధికారులు ముందుకు సాగితే ఎంతకైనా పోరాడతామని టిడిపి నేత మబ్బు దేవనారాయణరెడ్డి స్పష్టం చేశారు. శనివారం మఠంలో జరుగుతున్న టెండర్ ప్రక్రియ సమయంలో ఆయన దుకాణదారులతో కలిసి మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డితో వాగ్వాదానికి దిగారు. దుకాణదారులకు అన్యాయం జరిగితే పోరాటం చేయడానికి వెనుకాడమని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఇప్పటికే వినతి ఇచ్చామన్నారు.

రీటెండరింగ్ నిర్వహించాలి
నూర్ షరీఫ్, గుత్తేదారు, రాజమండ్రి



శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం కూల్చివేతకు సంబంధించి శనివారం జరిగిన టెండర్ ప్రక్రియ వాస్తవ పరిస్థితులకు విరుద్ధంగా జరిగిందని, ఐఐటి నివేదిక ప్రకారం మఠం మండువా భవనం ప్రాంతంలో ఎక్కడ నుండి ఎక్కడి వరకు కూల్చివేతలు నిర్వహిస్తారు అన్నదానిపై ఎటువంటి స్పష్టత ఇవ్వకుండా టెండర్లు నిర్వహించడం సమంజసం కాదని, జిల్లా కలెక్టర్ ఈ టెండర్ ప్రక్రియలో జోక్యం చేసుకొని రిటెండరింగ్ నిర్వహిస్తే ఇప్పుడు మఠం అధికారులు టెండర్లు కోట్ అయిన నగదు కంటే మరింతగా వేలంపాట నగదు పెరిగే అవకాశం ఉందని, ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని కలెక్టర్ మఠం భవనం కూల్చివేతకు సంబంధించి రీటెండరింగ్ కు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము. మరోవైపు దుకాణదారులకు ఎటువంటి ప్రత్యామ్నాయం చూపకుండా టెండర్ ప్రక్రియ చేయడం చూస్తుంటే టెండరు దక్కించుకున్న వారికి నష్టం చేకూర్చే పరిస్థితులు ఉన్నాయి.

భక్తునికి ప్రాణం పోసిన పోలీసు గుర్రప్ప

శ్రీవారి సన్నిధిలో గుండెపోటు భక్తుడికి 'సీపీఆర్'


కోలుకున్న భక్తుడు శ్రీనివాసులు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల వెంకన్న సన్నిధిలో క్యూలైన్లో నిలుచున్న భక్తుడికి సడెన్‌గా గుండెపోటు వచ్చింది. అక్కడే ఉన్న ఓ పోలీస్ చాకచక్యంగా వ్యవహరించి ప్రాణాలు కాపాడాడు. 'నువ్వు దేవుడివి సామీ' అని ఆ కుటుంబం అంతా ఆ పోలీస్‌కు కతజ్ఞతలు చెప్పుకుంది. ఆగస్టు 15న రాత్రి తిరుమలలో జరిగిన ఈ ఘటనలో ప్రాణాలతో బయటపడ్డాడు తెలంగాణకు చెందిన ఓ భక్తుడు.వివరాల్లోకి వెళ్తే..

సంగారెడ్డి జిల్లా కంది మండలం మామిడిపల్లి కి చెందిన మేడం శ్రీనివాసులు (61) వెంకన్న దర్శనం కోసం కుటుంబంతో తిరుమల వచ్చాడు. శుక్రవారం (ఆగస్టు 15) రాత్రి సుమారు 9:30 గంటల సమయంలో దర్శనం చేసుకున్నారు. అనంతరం లడ్డూ ప్రసాదాలు తీసుకుని కుటుంబ సభ్యులతో లడ్డు కౌంటర్ల వద్ద నుండి మ్యూజియం వైపుకు వెళుతున్నాడు. పడమర మాడ వీధిలో ఉన్నట్లుండి శ్రీనివాసులుకు గుండెపోటు వచ్చింది. మాట్లాడుతుండగానే గుండెను పట్టుకుని కింద పడిపోయాడు శ్రీనివాసులు. అక్కడే విధుల్లో ఉన్న తిరుమల వన్ టౌన్ పోలీస్ కానిస్టేబుల్ గుర్రప్ప గమనించి వెంటనే భక్తుడి దగ్గరికి చేరుకున్నాడు. సమయస్ఫూర్తితో 'సిపిఆర్' చేశాడు. దీంతో భక్తుడు కొంచెం కోలుకోగా వెంటనే అంబులెన్స్ ద్వారా తిరుమల అశ్విని ఆసుపత్రికి తరలించారు. అశ్విని ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేసిన తర్వాత తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు. స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందిన తర్వాత సదరు భక్తుడు ప్రాణాలతో బతికి బయట పడ్డాడు. డ్యూటీ డాక్టర్లు డిశ్చార్జ్ చేసి పంపించారు. సమయస్ఫూర్తితో స్పందించి భక్తుడిని కాపాడినందునకు భక్తులు, అధికారులు కానిస్టేబుల్ గుర్రప్పను అభినందించారు.



వేడుకగా గోకులాష్టమి



ప్రజాశక్తి - తిరుమల: 'భక్తుల భాగస్వామ్యంతో గోవులను రక్షించుకుందాం.. సంస్కృతిని కాపాడుకుందాం' అని టిటిడి ఈవో జె.శ్యామలరావు అన్నారు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణ శాలలో శనివారం గోకులాష్టమి పురస్కరించుకుని గోపూజ మహోత్సవ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర గోసంరక్షణశాలలో మొత్తం 2,789 గోవులు ఉన్నాయని, అందులో 1827 ఆవులు, 962 ఎద్దులు, 7 ఏనుగులు , 5 గుర్రాలు ఉన్నట్లు తెలిపారు. ప్రతిరోజు తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో పూజా కైంకర్యాల నిమిత్తం దేశవాళీ గోవుల పాలు, పెరుగు, వెన్న, నెయ్యిని గోశాల నుండి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు దైవ కార్యక్రమాలకే కాకుండా టీటీడీ పరిధిలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లలో వేచి ఉండే భక్తులకు, చంటి బిడ్డలకు, వద్ధులకు, అన్నప్రసాద వితరణ కేంద్రాలు, క్యాంటీన్లు, విద్యా సంస్థలు, ఆసుపత్రులకు ప్రత్యేకంగా పాలను సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.గో శాలలో రూ.12.25 కోట్లతో ఎస్వీ పశుదాణా తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గజరాజుకు పండ్లు అందించిన అనంతరం వేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. గోశాల సంచాలకులు శ్రీనివాస్, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాస్, సివి అండ్ ఎస్ఓ మురళీకృష్ణ, టిటిడి ఎక్స్ అఫిషియో మెంబర్ సి.దివాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలలోనూ గోగర్భం డ్యాం చెంత ఉన్న ఉద్యానవనంలో కాళీయమర్దనుడు అయిన శ్రీకృష్ణునికి ఉదయం పంచాభిషేకం చేశారు. అనంతరం ఉట్లోత్సవం నిర్వహించారు. ఆ తరువాత ప్రసాద వితరణ జరిగింది. ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కారణంగా ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.